ప్రజాశక్తి
www.prajasakti.com
మంగళవారం 6 ఆగస్టు 2024



వైవీయూ పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 4వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె .కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి విడుదల చేశారు. పీజీ కోర్సులైన సైకాలజీ, మైక్రోబయాలజీ, మ్యాథమ్యాటిక్స్, జియాలజీ, ఫుడ్ టెక్నాలజీ, జువాలజీ, మైక్రోబయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్సు , బోటనీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంపీఈడీ సబ్జెక్టులలో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు. త్వరితగతిన ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వెంకట్రామ్ పాల్గొన్నారు.

కదంతొక్కిన కార్మికులు

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

రాజకీయ వేధింపులు, బెదిరింపులు ఆపాలి

ఉద్యోగ భద్రత కల్పించాలి

స్థానిక నాయకులను కట్టడి చేయాలని డిమాండ్



ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

స్కీం వర్కర్ల, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ కార్మికులు కదం తొక్కారు. ప్రభుత్వం మారిన తరువాత రాజకీయ వేధింపులు అధికమయ్యాయని, వెంటనే బెదిరింపులు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్కీం వర్కర్లు, యానిమేటర్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగులను తీవ్రమైన వేధింపులు, మనోవేదనకు, ఆత్మహత్యలకు ప్రేరేపించే విధంగా స్థానిక నాయకుల వేధింపులు ఉన్నాయని చెప్పారు. ప్రధానంగా గ్రామీణ ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రాలో పనిచేసే యానిమేటర్లు, ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న వంట మనుషులు, అంగన్వాడీలో ఆయాలు, ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్లను, వాచ్‌మెన్లను రాజకీయంగా ఒత్తిడి తీసుకువచ్చి వారి చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేస్తుందన్నారు. మన జిల్లాలో 14 మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను, అంగన్వాడీలను, కడప, కమలాపురం, ముద్దనూరు, వేంపల్లి, చాపాడు ప్రాంతాల్లో బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్, మున్సిపల్ కార్మికులు, తొలగించొద్దన్నారు. నగర కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఆర్. లక్ష్మీదేవి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటకనే జిల్లా వ్యాప్తంగా తొలగిస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వేధింపులు గురైన బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. రాజకీయంగా వేధింపులు అవకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో పెడుతున్న రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. స్పందించిన డిఆర్ఒ ఈవిషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. సురేంద్ర కుమార్ వచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలిపి మీరు చేస్తున్న రాజకీయ వేదింపులు వ్యతిరేకంగా జరుగు పోరాటానికి తామ సంపూర్ణ మద్దతు అని తెలిపారు. ధర్నాలో గోపి, తిరుపాల్, సుంకర రవి, కిరణ్ ప్రకాష్, అంజలీదేవి, కుసుమావతి, ఉమా, ఆనంద్ కుమార్ ,నాగరాజు కుమార్ పాల్గొన్నారు.

భూములను స్వాధీనం చేసుకోవాలి

మహిళలపై దాడి చేసిన రామచంద్రారెడ్డిని అరెస్టు చేయాలి : వ్య.కా.స


బద్వేల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మండల పరిధిలోని కొత్తపల్లి రెవెన్యూ పొలంలో రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు నుంచి కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు అన్వేష్, వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం బద్వేల్ మార్కెట్ యార్డు నుంచి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పేదలు తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ సి.కొత్తపల్లె రెవెన్యూ పొలంలో ఐదు నెలలుగా పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. వారందరికీ మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 2న గుడిసెవాసుల పైన, దళిత మహిళలపై భూకబ్జాదారులైన టిడిపి నాయకులు రామచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, శివరాం రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు భౌతిక దాడులకు పాల్పడ్డారు వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. విఆర్ఒ జగదీష్ భూ కబ్జాదాల సహకరిస్తూ సర్వేనెంబర్ 54-7 గత నెలలో నూతనంగా లెటర్‌ను సృష్టించారని, కాబట్టి రెవెన్యూ ఉన్నతాధికారులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని కోరారు. అసైన్డ్ చట్టాన్ని ఉల్లంఘించి దొంగ పాసు పుస్తకాలు, పట్టాలు తయారు చేసుకొని ఆన్‌లై చేసుకున్నారని, వాటన్నిటిని స్వాధీన పరచుకోవాలన్నారు. మున్సిపల్ పట్టణానికి ఐదు కిలోమీటర్లు లోపు సాగు భూములకు ప్రభుత్వ భూములను ఇవ్వకూడదని జీవో ఉందని, ఆ జీవోను తక్షణం సి కొత్తపల్లి రెవెన్యూ పొలానికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బద్వేల్ తహశీల్దార్ ఉదయభాస్కర్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. తాసిల్దార్ స్పందిస్తూ విచారణ జరిపి పేదలకు న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండలు నాయకులు ఇ.రమణ, పి.రవిచంద్ర, రామ్మోహన్, దుర్గమ్మ, సుభద్ర ,స్వప్న, సరస్వతి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి : జడ్జి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

క్రమశిక్షణతో విద్యను అభ్యసించి చదివిన విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని అలంకాన్ పల్లి కడప పబ్లిక్ స్కూల్లో "గుడ్ టచ్, బ్యాడ్ టచ్, న్యాయ విజ్ఞాన సదస్సు:' నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదర భావం, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి చదివిన సంస్థకు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకుని రావాలి అని సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో కడప పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పుత్త శ్రీకాంత్ రెడ్డి, కడప పబ్లిక్ స్కూల్ చైర్మన్ సి. మధుసూదన్ రెడ్డి, కడప పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ పి. రామమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ప్లీనరీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో ఈనెల 7, 8 నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గండి. సునీల్ కుమార్, నగర కార్యదర్శి మనోజ్ పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ప్రకాష్ నగర్ ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి జిల్లా ప్లీనరీ సమావేశం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నంబర్ 117, 77 లను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మూసివేసిన సంక్షేమ హాస్టల్స్‌ను వెంటనే తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు వినోద్, మల్లికార్జున, అన్నమయ్య పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి సుందరయ్య కాలనీకి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని సుందరయ్య కాలనీ ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలు కావస్తున్నా సర్వేనెంబర్ 1008లో 100 కుటుంబాలకు నివాసం ఉంటున్న వారికి తాగడానికి మంచినీళు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పొలాల్లోకి వెళ్లి బోర్లు కింద నీళ్లు తెచ్చుకున్నటువంటి పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అనేక తపాలుగా ఆందోళన పోరాటాలు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. గతంలో ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ కాలనీని సందర్శించి పైపులును వేస్తామని చెప్పి హామీ ఇచ్చారని, ఇప్పుడు ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ కృష్ణ తహశీల్దార్, కలెక్టర్ , మున్సిపల్ చైర్మన్ దగ్గరికి వెళ్లి లెటర్ తీసుకొని వస్తేనే మీకు మంచి నీళ్లు ఇస్తానని చెబుతున్నారని, పేదలు తాగడానికి గుక్కెడు మంచినీళ్లు అడిగితే అనేక నిబంధనలు పెట్టి పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోతే పేదలతో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు. ఆంజనేయులు, మోక్షమ్మ, రామలక్ష్మమ్మ, బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా కెవికె స్వర్ణోత్సవాలు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె


మాట్లాడుతున్న కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ మనదేశంలో మొట్ట మొదట కెవికెను 1974 మార్చి 21న ఏర్పాటు చేశారని తెలిపారు. 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి కృషి విజ్ఞాన కేంద్రాల వర్ణోత్సవాల వేడుకలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కడపలో తొలుత 1993, జూన్ 16న ఏర్పాటు చేశారని, తర్వాత 2005లో కడప నుంచి ఊటుకూరుకు మార్చారనిచెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించడం, ప్రథమ శ్రేణి క్షేత్ర పరిశీలన నిర్వహించడం, రైతులు, మహిళలు, యువకులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో తర్ఫీదునివడం గ్రామాల్లో చదువుకున్న యువతీ యువకులకు ఆదాయాన్నిచ్చే వివిధ వృత్తుల్లో శిక్షణను ఇవ్వడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. రైతులకు శాస్త్రీయ సలహాలు ఇవ్వడం, వ్యవసాయ సాంకేతికతలకు కెవికె విజ్ఞాన, వనరుల కేంద్రంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అంకయ్య కుమార్ మాట్లాడుతూ కెవికె సిబ్బంది విశిష్టమైన కృషి వల్ల జిల్లాలోని రైతుల్లో మంచి గుర్తింపు రావడమే కాకుండా, అనేకమందికి ఆర్థిక, సామాజభివృద్ధికి పాటుపడిందని పేర్కొన్నారు. మరో శాస్త్రవేత్త శ్రీనివాస అచారి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల సాంకేతిక విజ్ఞానాన్ని సకాలంలో రైతులకు చేరవేయడంలో కెవికె ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. రైతు శిక్షణ కేంద్రం సంచాలకులు రమణారెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా విస్తరణ సేవలను అందించడంలో ఎప్పుడు ముందు ఉంటుందని ఆయన తెలిపారు. వనిపెంట కెవికె సమన్వయకర్త బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుకల టార్చ్‌ను వెలిగించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త సునీల్ కుమార్ కెవికె పంట పొలంలో డ్రోన్ల సహాయంతో వేరుశనగ జొన్న పంటలో పోషకాల పిచికారి చేసి రైతులకు చూపించారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్పందనలో కడప నగర పాలక ఇన్‌ఛార్జి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు 5వ తేదీ అవుతున్న ఇంకా వారి అకౌంట్స్‌లో వేతనాలు పడలేదని పేర్కొన్నారు. ప్రతి నెల ఇద్దరు, ముగ్గరికి వేతనాలు వెయ్యలేదని చెప్పారు. 24 గంటల్లో వేతనాలు వేయకపోతే ఆందోళనకు వెళ్తామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ క్లర్కును పిలిచి వెంటనే జీతాలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయ భాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఆనంద రావు, బ్రహ్మ నంద రెడ్డి. నగర ప్రధాన కార్యదర్శి కేశవులు, పర్మినెంట్ సంగం జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, నగర నాయకులు చిన్న ఓబుళరెడ్డి, ప్రవీణ్ చంద్ర, రాయుడు, నారాయణ, సత్యనారాయణ. సుబ్బారాయుడు, ఘోస్, కార్మికులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : తమ భూమిని దాయాదులు ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని భూ బాధితులు బి.మఠం మండలం, సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న పెసల జయరామిరెడ్డి, మల్లికార్జున రెడ్డి కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రెండు ఎకరాల 20 సెంట్లు భూమి ఉందని చెప్పారు. ఇందులో 100 కొబ్బరి చెట్లు, 20 సెంట్లు వరి నారు వేశామని తెలిపారు. తమ దాయాదులు ఈశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి, రవి శంకర్ రెడ్డి, మరి కొంతమంది టెంకాయ చెట్లను నరికేశారని, వరినారు దున్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవాలని వారు వాపోయారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

తహశీల్దార్‌కు సత్కారం


ప్రజాశక్తి-కాశినాయన


తహశీల్దార్‌ను సన్మానిస్తున్న రవీంద్రరెడ్డి

నూతన తహశీల్దార్‌గా బాల నరసింహులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను టిడిపి మండల నాయకులు రవీంద్రారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకుడు మాట్లాడుతూ మండలంలో పేదలకు సంబంధించి ఎన్నో భూ సమస్యలు ఉన్నాయని, వాటిని కచ్చితంగా న్యాయబద్ధంగా పరిశీలించి పరిష్కరించాలని పేర్కొన్నారు. ఐదేళ్లుగా భూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం రవీంద్రారెడ్డి వెలుగు కార్యాలయానికి వెళ్లి ఎపిఎం వీరాంజనేయులుతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండ నరసింహారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -అట్లూరు


చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న నాగేశం

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం కోరారు. సోమవారం మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా నాగేశం మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న విఆర్ఎలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గత ప్రభుత్వంలో విఆర్ఎలు అంత్యంత నిరాదరణకు గురయ్యారని పేర్కొన్నారు. వారి పరిస్థితి దారుణంగా ఉందని వాపోయారు. విఆర్ఎల్లో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిమ్ మైనార్టీ వర్గాలకు చెందినవారే ఉన్నారని పేర్కొన్నారు. వారిచే వెట్టి చారికి చేయించుకుంటూ వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, బినామీలను తొలగించి అర్హులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నాగేశం తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అట్లూరు



ఎస్ఐకి వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మండలంలోని పెద్దకామసముద్రం పాఠశాల విద్యార్థులు విద్యుత్ ప్రమాదానికి గురవడానికి కారణమైన కాంట్రాక్టర్ బుజ్జి బాబును తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో పెద్ద కామసముద్రం ప్రభుత్వ పాఠశాలలో జులై 31న ఆ పాఠశాలలో 21 స్తంభాలను కాంట్రాక్టర్ బుజ్జిబాబు నిల్వ ఉంచారని, విద్యార్థులు ఆ స్తంభాల వద్దకు వెళ్లినప్పుడు వారి మీద పడ్డాయని, ప్రమాదలో ఒక విద్యార్థికి కాళ్లు, చేతులు విరిగాయని పేర్కొన్నారు. మరో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయని తెలిపారు. గ్రామస్తులు వెంటనే స్పందించి గాయపడిన విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పించారన్నారు. ప్రమాదానికి కారకుడైన కాంట్రాక్టర్ కనీసం విద్యార్థులను పరామర్శించినా పాపాన పోలేదని వాపోయారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ స్పందించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, గాయపడిన ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని, కాళ్లు చేతులు విరిగిన విద్యార్థినికి రూ.30 లక్షలు ఇవ్వాలని, వెంటనే ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందిచాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యు.ఆంజనేయులు, మండల నాయకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు

ఆరోగ్యమాత ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్


ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫాదర్లు

కడప వేలంగిణి ఆరోగ్య మాత ఉత్సవాలు సెప్టెంబర్ 7, 8 తేదీలలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ఎం.డి. ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆరోగ్య మాత చర్చిలో ఉత్సవాల పోస్టర్లు సహాయ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, చర్చి పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. డి. ప్రసాద్ మాట్లాడుతూ కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి ఆదేశాల మేరకు ఆరోగ్యమాత ఉత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి నవదిన పూజ ప్రార్థనలతో ప్రారంభం కానున్నవని తెలిపారు. 29న పతాక ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా కర్నూలు మెత్రాణులు మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గోరంట్ల జ్వనేష్, ఈనెల 8న కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి, హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి, సెప్టెంబర్ 6 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంతోని,రాజన్, డేవిడ్, జార్జి, సెబాస్టిన్, విక్టర్, మోహన్, రాజకుమార్, జయరాజ్, యూత్ కమిటీ సభ్యులు ప్రసాద్, విన్సెంట్ ది పాల్, మరియదళం, మౌలిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు వరం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

తల్లిపాలు బిడ్డకు వరంలాంటిదని అంగన్వాడీ సూపర్‌వైజర్ పి. లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం రసూల్ పల్లె గ్రామ సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో సూపర్‌వైజర్ మాట్లాడుతూ వారికి తల్లిపాల విశిష్టతను వివరించారు అప్పుడే పుట్టిన బిడ్డకు సైతం పాలు తాపిస్తే రోగని రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. ఆహార నియమాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టిక ఆహారం తీసుకుని వాటి ద్వారా తల్లులు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు అనంతరం తల్లిపాలు బిడ్డకు ఎలా పట్టాలని విషయంపై వారికి అవగాహన కల్పించారు కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు

రసవత్తరంగా క్రికెట్ మ్యాచ్‌లు

- మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 347/10

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 19 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కెస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 91.1 ఓవర్లలో 347 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆర్. రోహిత్ 76, చేతన్ రెడ్డి 72, గురు చరన్ 70, ప్రణవ్ కుమార్ రెడ్డి 66 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎస్. ఎస్. హమీద్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 23.4 ఓవర్లు వేసి అందులో 5 ఓవర్లు మేడిన్ వేసి 83 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీసుకొని రికార్డ్ సృష్టించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట మూసే సమయానికి 1.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. **మొదటి మ్యాచ్‌లో 219 పరుగులకు కృష్ణా జట్టు ఆల్ అవుట్ ..** వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 71.1 ఓవర్లలో 219 పరుగులకు కృష్ణా జట్టు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ధనుష్ 62, వరుణ్ సాత్విక్ 34, భాను వరప్రసాద్ 34 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని పూర్ణ 4, సుశాంత్ 2 టికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయంలో 12.5 ఓవర్లలో 2 వికెట్లను స్థానికి 34 పరుగులు చేసింది. **మొదటి ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి 262/10..** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 262 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. చిత్తూరు జట్టులోని సాయి దొరబాబు రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34.0 ఓవర్లలో మూడు వికెట్లను స్థానిక 99 పరుగులు చేసింది.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానం

ప్రజాశక్తి- కడప అర్బన్


మాట్లాడుతున్న కందుల ఓబుల్‌రెడ్డి

జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉండాలంటే అది క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులతోనే ముడిపడి ఉంటుందని కందుల విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి అన్నారు. సోమవారం కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు కూడా పిల్లల పట్ల బాధ్యత కలిగి ఉండాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సైఖో సోషియో కౌన్సిలర్ పి.వి.సునీత మాట్లాడుతూ ఈ రోజుల్లో మహిళలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలో జరుగుతున్న అనేక సమస్యలను వివరించారు. అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. కరస్పాండెంట్ కె. రాజేశ్వరి మాట్లాడుతూ కెఎల్ఎం కళాశాలను ఎంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ మాట్లాడుతూ కెఎల్ఎంలో అన్ని విలువలతో కూడిన విద్యాభ్యాసం మహిళల్లో చైతన్యం కలిగించే అవకాశం ఉందని చెప్పారు. అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ వైస్ చైర్మన్ కే.మదన్ మోహన్ రెడ్డి, అన్ని శాఖల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

భూమికి హద్దులు చూపించాలి

ప్రజాశక్తి కడప అర్బన్ : చాపాడు మండలం మడూరు పంచాయతీలో ఉన్న తమ భూమికి హద్దులు చూపించి న్యాయం చేయాలని బాధితురాలు అంజనమ్మ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నంబర్ 403ఎ1లో 35 సెంట్లు, సర్వే నెంబరు 136 ఏ2లో, ఎ3లో తమ భూమికి సంబంధించిన హద్దులు చూపించాలని తహశీల్దార్ కార్యాలయంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేశామని చెప్పారు. అయినా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల నుంచి అధికారులు తిప్పుకుంటున్నారే కానీ హద్దులు చూపించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్లకు వినతి పత్రం సమర్పించిన న్యాయం చేయలేదని తెలిపారు.


రేషన్ బియ్యం ఉంచిన గ్రామ పంచాయతీ కార్యాలయం

రేషన్ బియ్యం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామ ప్రజలు రేషన్ బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ప్రతినెల ఒకటి నుంచి 11వ తేదీలోగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. గత ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ పంపిణీలో భాగంగా ఎండియు ఆపరేటర్ల ద్వారా వాహనాల్లో రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేవారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే విధానంలో పంపిణీని కొనసాగిస్తున్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత రేషన్ డీలర్ల మార్పు చేపట్టారు. పాత డీలర్లను తొలగించి వారి స్థానంలో గ్రామ విఆర్ఎలకు రేషన్ పంపిణీ అప్పగించారు. కానీ రేషన్ బియ్యాన్ని మాత్రం టిడిపికి అనుకూలమైన వారికి అప్పగించారు. అల్లాడుపల్లె గ్రామంలో విఆర్ఎ వీర భద్రకు రేషన్ పంపిణీ అప్పగించారు. అయితే బియ్యాన్ని పాత సచివాలయంలో నిలువ ఉంచారు. ఎండియు ఆపరేటర్ రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని అడిగినప్పటికీ స్టాకు తక్కువగా ఇచ్చారని కారణంతో పంపిణీ చేపట్టేందుకు స్థానిక నాయకులు ఒప్పుకోలేదు. దీంతో గ్రామంలో రేషన్ బియ్యం కోసం పేద ప్రజలు ఎదురుచూస్తున్నారు. అల్లాడుపల్లె గ్రామంలో 494 రేషన్ కార్డులున్నాయి. వీరికి 128 బస్తాల రేషన్ బియ్యం రావాల్సి ఉండగా.. 102 బస్తాలు మాత్రమే వచ్చాయని, 74 కిలో చక్కెర మాత్రమే వచ్చిందని, మిగిలిన స్టాక్ వచ్చే పంపిణీ చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. దీనిపై ఆర్ఐ ప్రమీలను వివరణ కోరగా.. ఎండియు ఆపరేటర్ ఇతర గ్రామాల్లో పంపిణీ చేస్తున్నాడని, అక్కడ పూర్తయిన తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు.

దోమతెరలు తప్పక వాడాలి

ప్రజాశక్తి - చాపాడు

దోమలతోనే పలు రోగాలు వస్తాయని, వీటి నివారణకు దోమతెరలు వాడాలని డాక్టర్ పి.శ్యామసుందర్ సూచించారు. మండలంలోని ఎస్.ఓబాయపల్లె గ్రామంలో ప్రజలకు ఆరోగ్యంపై డాక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం కావడంతో ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉంటుందని, ఆ నీటిలో దోమలు గుడ్లు పెట్టి లార్వా తయారై ప్యూపా దశకు వచ్చి చివరగా దోమగా ప్రజలకు కాటు వేస్తాయన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. తాజాగా ఉండే ఆహారం తినాలని ఆమె ప్రజలకు సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి కావచ్చని, వెంటనే ఆశా కార్యకర్త, వైద్య సిబ్బందికి తెలపాలన్నారు. గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే చేయించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. చెంచయ్య, హెల్త్ సూపర్వైజర్ బాబురెడ్డి, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు పోతులూరమ్మ, ఓబులమ్మ, అంగన్వాడీ కార్యకర్త రేణుకా, ప్రజలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సరైన పోషణ

- మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తల్లి పాల ద్వారా బిడ్డకు సరైన పోషణ లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని స్త్రీశక్తి భవన్లో ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని సిడిపిఒ హైమవతి ఆధ్వర్యంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రఘునాథరెడ్డి గర్భిణులు, బాలింతలు సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. సిడిపిఒ హైమవతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు ఇచ్చే ముర్రుపాలు ఎన్నో పోషకాలనిస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శివప్రసాద్రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. లక్ష్మీపేట అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. దీంతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లి పాలతోపాటు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే అనుబంధ పోషకాహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భారతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చక్రాయపేట : పుట్టిన బిడ్డకు తల్లిపాలు సురక్షితమని సిడిపిఒ సునీత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుమార్ కాలువ దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో టీచర్ శాంతకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిడిపిఒ సునీత మాట్లాడుతూ తల్లులు ప్రసవించిన వెంటనే గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుభాషిని, ఎఎన్ఎం శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు బుజ్జి, శాంత కుమారి, తల్లులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు రూరల్ సిఐగా జె.శివశంకర్ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మైదుకూరు రూరల్ సిఐగా శ్రీనాథరెడ్డి కడప విఆర్కు వెళ్లారు. ఆయన స్థానంలో కడప విఆర్లో ఉన్న శివశంకర్ను ఉన్నతాధికారులు మైదుకూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై గట్టి చర్యలు చేపడతామన్నారు. రూరల్ పోలీస్స్టేషన్ పరిధిలోని సిబ్బంది సిఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు చేపడుతున్న శివశంకర్

పంట నమోదుతో ప్రయోజనం


పంట నమోదులో ఎడిఎ సురేష్రెడ్డి, ఎఒ శివశంకర్రెడ్డి, విఎఎ హరీంద్ర

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఖరీఫ్ సీజన్లో సాగుచేసే ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటే ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు సురేష్రెడ్డి పేర్కొన్నారు. ఉప్పరపల్లె గ్రామంలో పంట నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లితే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వివిధ రకాల సాయమందిస్తుందన్నారు. ఈ ప్రయోజనాలు పొందేందుకు రైతులు తాము సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమాన్ని స్వయంగా చేయించుకోవాలన్నారు. గిట్టుబాటు ధర కల్పించే క్రమంలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలు ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ పంట దిగుబడులను అమ్ముకోవాలన్నప్పటికీ ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అవుతుందన్నారు. పంట నమోదులో నిర్లక్ష్యం వహించారదని ఆయన రైతులకు సూచించారు. విఎఎ, విఆర్ఒలు పంట నమోదు యాప్పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివశంకర్రెడ్డి, విఎఎ హరీంద్ర, విఆర్ఒ జహరుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో బెట్ట నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పత్తి పంటలో బెట్ట నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సాగు చేసిన పత్తి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రత్తి పంటలో బెట్ట పరిస్థితి ఏర్పడినప్పుడు లీటరు నీటిలో 20 గ్రాములు యూరియాను కలిపి ఆకులు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు పిప్రోనిల్ మందు 2 ఎమ్ఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకులపైన గుడ్లు పెట్టే సమయం కనిపించినప్పుడు వేప నూనె 5 ఎమ్ఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ, పచ్చ దోమ, నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు పొలంలో ఎకరానికి 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.


పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

రైల్వేస్టేషన్లో తాగునీరు వృథా

ప్రజాశక్తి - ముద్దనూరు

నీటిని వృథా చేయరాదు.. ప్రతి నీటి బొట్టును ఆదా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. నీరు లేకపోతే కరువు పరిస్థితులు ఏర్పడతాయని వర్షపునీటిని సైతం ఒడిసి పట్టాలని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముద్దనూరు రైల్వేస్టేషన్లో ఇందుకు భిన్నంగా ఉంటుంది. రైల్వేస్టేషన్లో మొదటి ప్లాట్ఫాంలో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన నీటి కుళాయిల్లో నీరు వృథాగా పోతోంది. ఆ నీరు పారుతూ ఉండడంతో ప్లాట్ఫాంలో పాచి పట్టి మురుగుగా తయారైంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో పాచిపైన అడుగు పెడితే కాలుజారి రైలు కిందపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు, స్థానికులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రైల్వేస్టేషన్ అధికారులు స్పందించి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుని ప్లాట్ ఫాంపై ఏర్పడిన పాచిని తొలగించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


వృథా నీటితో ప్లాట్ ఫాంపై నిలిచిన మురుగు

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ రమాకుమారి పేర్కొన్నారు. దువ్వూరు తహశీల్దార్గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల్లో భాగంగా సత్యసాయి పుట్టపర్తి జిల్లాలోని తలుపుల మండలానికి బదిలీపై వెళ్లారు. అనంతరం కొత్త ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా రమాకుమారి ముద్దనూరుకు వచ్చారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల వేదికలో రైతులు, ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

చాపాడు : చాపాడు నూతన తహశీల్దార్గా రవీంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన తహశీల్దార్లను ఆయా మండలాలకు కేటాయించారు. ఇందులో భాగంగా చాపాడుకు రవీంద్రారెడ్డిని నియమించారు.

18 వరకు సెలవులో..

నూతన తహశీల్దార్గా బాధ్యతలు చేపట్టిన రవీంద్రారెడ్డి అనారోగ్య కారణంతో ఈనెల 18వరకు సెలవుపై వెళుతున్నట్లు సమాచారం. ఆయన మళ్లీ బాధ్యతలు చేపట్టేవరకు ఇన్ఛార్జి తహశీల్దార్గా జమ్మలమడుగు ఆర్డిఒ కార్యాలయ తహశీల్దార్ తిరుపతయ్యను నియమిస్తున్నట్లు సమాచారం.

పులివెందుల టౌన్ : పులివెందుల నూతన తహశీల్దార్గా నజీర్అహ్మద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా ఆయన ప్రొద్దుటూరు నుంచి వచ్చారు. ఈ సందర్భంగా నజీర్అహమ్మద్కు రెవెన్యూ అధికారులు ఘనస్వాగతం పలికారు. సిబ్బందిని ఆయన పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఒలు పాల్గొన్నారు.

వేముల : వేముల తహశీల్దార్గా ఇందిరారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు లేకుండా చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తమ సమస్యలను రైతులు తనకు నేరుగా చెప్పవచ్చు అన్నారు. రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్కు మర్యాద పూర్వకంగా అభినందనలు తెలిపారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల తహశీల్దార్గా శోభన్బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొండాపురం తహశీల్దార్గా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీలో భాగంగా ఎర్రగుంట్లకు వచ్చారు. ఆ మేరకు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయం సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇఇ భరణికృష్ణ

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సబంధిత సమస్యలపై వెంటనే స్పందించి ప్రజలకు సమాచారం అందించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.భరణికృష్ణ ఆదేశించారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో సోమవారం డిఇఇ, ఎఇ, విద్యుత్ శాఖ అధి. కారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ 33కెవి, 11కెవి అంతరాయాలను వెంటనే పరిష్క రిం చాలన్నారు. ప్రతి అధికారీ ఫోన్కాల్స్లో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫోన్కాల్స్ వెంటనే స్పందించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించకపోతే అధికారుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్స్కు పరిష్కారం చూపాలన్నారు.

సిఎం రాయలసీమ సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ వాసి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ప్రాంత సమస్యలపై దృష్టి పెట్టాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సూచించారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకనాడు రతనాల సీమగా పేరుగాంచిన రాయలసీమ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రాళ్ల సీమగా మారిందన్నారు. రాయలసీమకు నవమోసాలు జరిగినట్లు తెలిపారు. అమరావతిపై చూపుతున్న శ్రద్ధలో కనీసం పదవ వంతైనా సీమపై పెట్టాలన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 46 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద కేంద్రం రూ.24,350 కోట్ల నిధులు ఇవ్వాలన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం రూ.1,050 కోట్లు ఇచ్చిందని చెప్పారు. మిగిలిన నిధులు తెప్పించి సీమను అభివృద్ధి చేయాలని కోరారు.

రచయిత బొమ్మిశెట్టికి పుస్తకం అందజేత

ప్రజాశక్తి - చాపాడు

రచయిత, చరిత్ర పరిశోధకులు బొమిశెట్టి రమేష్కు ప్రముఖ రచయిత పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి సంపాదకత్వం వహించిన కీర్తిశేషులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డిపై వచ్చిన కేతు తలపులలో పుస్తకాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి ఎంతో గొప్ప వ్యక్తి అని, అలాంటి సాహితీవేత్త, రచయితకు సంబంధించిన పుస్తకాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తుల ఆలోచనలు వారి గురించి తెలుసుకోవడం నేటి తరానికి ఎంతో అవసరమన్నారు.


కేతు తలుపులు పుస్తకాన్ని అందుకుంటున్న బొమిశెట్టి రమేష్


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఎమ్మెల్సీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లితండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపాల్ షేక్ రంతుబాషా మాట్లాడుతూ కళాశాలలో ల్యాబ్ ఎక్విప్మెంట్ ఫర్నిచర్, బీరువాలు, వాచ్మెన్ పోస్ట్, ఆయాను, నియ మించాలని ఎమ్మెల్సీని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. విద్యార్థులకు సరైన సమయానికి బస్సులు రాలేదని ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. తక్షణమే బస్సు సౌకర్యం పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లి మాజీ ఎంపిటీసీ జీవీ రమణ, విశ్రాంతి ఉపాధ్యాయుడు మాధవరెడ్డి, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

గండి పవిత్రతను కాపాడండి

ప్రజాశక్తి - వేంపల్లె

పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయ పవిత్రతను జిల్లా ఉన్నతాధికారులు కాపాడాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వడ్లకుంట రాజారావు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గండిలో జరిగే శ్రావణ మాస వారోత్సవాలు సందర్భంగా వేసిన ఆహ్వాన పత్రికలను గండి ఇఒ ముద్రించారని తెలిపారు. ఆ ఆహ్వానపత్రికల్లో సిఎం చంద్రబాబు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫొటోలు ముద్రించకపోవడం దారుణమన్నారు. ఇఒ, ఆలయ ప్రధాన అర్చకులు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గండి దేవస్థానానికి మంచి అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. అర్చకులను ఇతర దేవాలయాలకు మార్చాలని కోరారు. గండి దేవస్థానంలో అర్చకులు చెప్పిందే వేదంగా మారిందని చెప్పారు. హారతి పళ్లెం డబ్బులను హుండీలో వేయాలని జిఒ ఉన్నప్పటికీ అమలుకావడంలేదన్నారు. గండి దేవస్థానాన్ని సొంత ఆస్తిలా అర్చకులు భావిస్తున్నట్లు తెలిపారు. గండిలో పనిచేసే అర్చకులు రూ.కోట్ల ఆస్తులను సంపాదించారని ఆరోపించారు. ఈ ఆస్తులపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో టిడిపి నేతలు పాపిరెడ్డి శ్రీనువాసులు, బ్రహ్మానందరెడ్డి, వేమ కుమార్ పాల్గొన్నారు.


రఘునాథ్రెడ్డి దంపతులను ఆహ్వానిస్తున్న ప్రధాన అర్చకుడు హరి ప్రవీణ్

ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో జరిగే శ్రావణమాస ఉత్సవాలకు హాజరు కావాలని టిడిపి ఇన్ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి సతీమణి లతారెడ్డికి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్రెడ్డికి దేవస్థానం ఇఒ విశ్వనాథ్రెడ్డి ఆహ్వానపత్రికలు అందజేశారు. ఆ మేరకు ఆయన సోమవారం సింహాద్రిపురంలో లతారెడ్డికి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్రెడ్డి, పద్మావతికి ఇఒ విశ్వనాథ్రెడ్డి, ప్రధాన అర్చకుడు హరి ప్రవీణ్, టిడిపి నేత పివి రమణ ఆహ్వాన పత్రికలను అందజేశారు. నాలుగు వారాలపాటు ఎద్దుల కొండపై, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి, మెయిన్ బజార్లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయాల్లో ప్రతి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో మరణమే శరణ్యమా..?

- సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఏసుదాస్, దాసరి విజయ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్కీమ్ వర్కర్లకు కూటమి ప్రభుత్వంలో మరణమే శరణ్యమా అని సిఐటియు పట్టణ అధ్యక్షులు జి.ఏసుదాస్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ ప్రశ్నించారు. స్థానిక ఎద్దుల ఈశ్వర్రెడ్డి విగ్రహం వద్ద సోమవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాల గ్రామాల్లో కూటమి ప్రభుత్వం కిందిస్థాయి రాజకీయ నాయకులు స్కీం వర్కర్లపై భౌతిక దాడులు చేస్తున్నారని తెలిపారు. వారు ఉద్యోగాలకు రాజీనామా చేయాలని తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారన్నారు. ఎపిలో ఉన్న అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్ ఆయాలను, ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్లను ప్రభుత్వ హాస్టల్లో పనిచేసే వారు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఇలా అనేక ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న వర్కర్లపైన అనేక రూపాల్లో దాడులు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై సంబంధిత అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థల్లో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న స్కీం వర్కర్ల పట్ల స్థానిక రాజకీయ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని, చేసేదిలేక మరణమే శరణ్యం అంటూ చావుల అంచులకు చేరుతున్నారన్నారు. ఇకనైనా వెంటనే దాడులు ఆపి న్యాయబద్ధంగా ఉండాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అబ్రహం, ఆంజనేయులు పాల్గొన్నారు.